క్లుప్తంగా

ముద్రగడతో అనుబంధం మరువలేనిది



ముద్రగడతో మాట్లాడుతున్న సోమశేఖర్, ప్రభాకర్

కిర్లంపూడి: మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభంతో తనకున్న అనుబంధం మరువలేనిదని రిటైర్డ్ డీఎస్పీ పిట్టా సోమశేఖర్ అన్నారు. కిర్లంపూడిలోని ముద్రగడ నివాసంలో శనివారం ఆయనను కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం త్వరగా కొలుకోని రాజకీయాల్లో చురుకైన పాత్ర వహించాలని ఆయన ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు చల్లా ప్రభాకర్, గౌతు స్వామి తదితరులు ఉన్నారు.

ఉద్యమ్ ఆధార్‌తో చిరు వ్యాపారులకు మేలు

కిర్లంపూడి: చిరు వ్యాపారులకు ఉద్యమ్ ఆధార్‌తో ఎంతో మేలు జరుగుతుందని జిల్లా నాన్ ఫామ్ ఏపీఎం పి.విజయలక్ష్మి అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద ఏపీఎం ఎస్.వేదకుమారి అధ్యక్షతన ఏపీడీఐసీ ఆధ్వర్యంలో శనివారం ఉద్యమ్ ఆధార్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు 240 మందికి ఉద్యమ్ ఆధార్ రిజిస్ట్రేషన్‌లో నమోదు చేసుకున్నారన్నారు. అర్హులైన చిరు వ్యాపారస్తులకు త్వరలోనే సర్టిఫికెట్స్ అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు ఎస్.బుల్లియ్య, వై.లోవరాజు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పోషక విలువలతో రుగ్మతలు దూరం



లచ్చిరెడ్డిపాలెంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు చాణుక్య

రౌతులపూడి: మండలంలోని లచ్చిరెడ్డిపాలెంలో కాకినాడ జీజీహెచ్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ చాణుక్య ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో 127 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కౌమార దశలోవున్న బాలికలు, గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు లోనుకాకుండా ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటిస్తూ పోషక విలువలు కల్గిన ఆహారాన్ని తీసుకోవటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది మురళి, నానాజి, విజయలక్ష్మి, అంగన్‌వాడీలు కృష్ణవేణి, కోమల, నూకాలమ్మ, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

గోకవరం: ఆర్చిబాల్డ్ మెమోరియల్ మైటీ ఆడొనోయా 'అమ్మ మెమోరియల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు డాక్టర్ పిపిఎస్ కిరణ్ తెలిపారు. రంప ఎర్రంపాలెంలో శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ బాదంపూడి హర్షిత ప్రకాష్ ప్రారంభించారు. స్థానిక పరిసర గ్రామాల నుంచి వచ్చిన 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో ఏడుగురు రక్తదానం చేశారు. ఐసీడీఎస్ సీడీపీఓ బి.సంధ్యారాణి, పి.ఇందిరారాణి, తొట్ట సత్యన్నారాయణ, నారా ప్రసాద్, పప్పు రాఘవులు, జాజుల అవతారం తదితరులు ఉన్నారు.

ఆరోగ్యం పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

ప్రత్తిపాడు రూరల్: మహిళలు, చిన్నారుల ఆరోగ్యం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి తెలిపారు. మండలంలోని ధర్మవరం సచివాలయం-2, పోతులూరు గ్రామాల్లో పౌష్టికాహార సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ఉషశ్రీ, రాంకుమార్, గైనికాలజిస్టు వంశీ ప్రియ, మురళీమోహన్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ గర్భిణులు, మహిళలు చిన్నారులకు పౌష్టికాహారం అందించే ప్రక్రియలో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు.

సమన్వయంతో పనిచేయాలి



శిక్షణ పొందిన వారితో ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీడీఓ నారాయణ

కోటనందూరు: పంచాయతీలకు ఆదాయం సమకూర్చడంలో పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు సూచించారు. పంచాయతీలకు ఆదాయ మార్గాలపై అవగాహన కల్పించేందుకు పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు రెండు రోజుల పాటు ఇచ్చిన శిక్షణ శనివారంతో ముగిసింది. ఎంపీపీ మాట్లాడుతూ పల్లె ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించాలంటే పంచాయతీలకు ఆదాయం తప్పనిసరన్నారు. ఆదాయ మార్గాలపై దృష్టి సారించి పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ వెంకటనారాయణ, డిప్యూటీ ఎంపీడీఓ జయరాం, ఎంఈఓలు శ్రీనివాస్, రామశేఖర్ పాల్గొన్నారు.

ఎనాళ్లో తాండవం..!

- నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులు
- వరదలతో తెగిపోతున్న సంబంధాలు
- 50 గ్రామస్తులకు తప్పని అవస్థలు



అసంపూర్తిగా తాండవ బ్రిడ్జి నిర్మాణ పనులు



ఇటీవల కురిసిన వర్షాలకు కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న వరదనీరు

కోటనందూరు: మండలంలోని తాండవ నదిపై నిర్మించ తలపెట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా తుపానులు, వరదల సమయంలో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. తాండవ నదీ పరివాహక ప్రాంతంలో భారీగా వర్షం కురిసినా, జలాశయం నుంచి నది ద్వారా సముద్రానికి నీటిని విడిచిపెట్టినా కోటనందూరులో కాజ్‌వే (బ్రిడ్జి)పై నుంచి నీరు భారీగా ప్రవహించి ప్రజల రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. దీంతో ఈ బ్రిడ్జి ఆధారంగా ప్రయాణించే 50 గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. అధికార యంత్రాంగం, ప్రస్తుత పాలకులు స్పందించి బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

తుని - నర్సీపట్నం రోడ్డు నుంచి కోటనందూరు గ్రామానికి చేరుకోవాలంటే మధ్యలో ఉన్న తాండవ నదిని దాటాల్సిందే. 1976లో అప్పటి పాలకులు, రైతులు ఆర్థిక భాగస్వామ్యంతో ప్రభుత్వం రూ.13 లక్షలు ఖర్చు చేసి తాండవ నదిపై కాజ్‌వే (బ్రిడ్జి)ని నిర్మించారు. అప్పటి ప్రజల అవసరాలు, రోడ్ల పరిస్థితులకు అనుగుణంగా నిర్మించిన ఈ కాజ్‌వే ఆనాటి ప్రజలకు ఇబ్బందులు తొలగించింది. కాలక్రమంలో కాజ్‌వే శిథిలం కావడం, ఇరుపక్కల రక్షణ లేకపోవడం, ఎత్తు, వెడల్పు, కింద పిల్లర్ల మధ్య దూరం తక్కువగా ఉండడం వంటి కారణాలతో నేటి ప్రయాణ అవసరాలకు ఇబ్బందిగా మారింది. వరదల సమయంలో నదిలో నీరు కాజ్‌వే పైనుంచి ఉధృతంగా ప్రవహించి తుని-నర్సీపట్నం రోడ్డు, కోటనందూరు గ్రామానికి పూర్తిగా సంబంధాలు తెగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో కాజ్‌వేను బ్రిడ్జిగా అభివృద్ధి చేయాలని గత ఐదు దశాబ్దాలుగా స్థానిక ప్రాంత ప్రజలు డిమాండు చేస్తున్నారు.

అన్ని రకాలుగా అభివృద్ధి

కోటనందూరులో తుని-నర్సీపట్నం రోడ్డు నుంచి పాతకొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం, రౌతులపూడి, శంఖవరం మీదుగా కత్తిపూడి వద్ద 216 నంబరు హైవేకు చేరుకునేందుకు 33 కిలోమీటర్ల పొడవ గల రోడ్డు ఉంది. తాండవ నదిపై సరైన బ్రిడ్జి లేక ఈ మార్గంలో భారీ వాహనాలు తిరిగే అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా ఈ రోడ్డు లూప్‌లైన్‌గానే మిగిలిపోయింది. ఇక్కడ ఉన్న కాజ్‌వే బ్రిడ్జిగా అభివృద్ధి చెందితే సౌకర్యవంతమైన ప్రయాణంతో పాటు రోడ్లు, వ్యాపార వనరులు, ఆర్థికంగా, సామాజికంగా పురోగతి సాధించి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.

బ్రిడ్జి నిర్మాణంతో ఎంతో మేలు



తాండవ నదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ప్రజల రాకపోకలతో పాటు ఈ ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుంది. వరదలు, అత్యవసర సమయాల్లో ప్రయాణం సౌకర్యవంతంగా మారుతుంది. ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి.

ఉల్లూరి శ్రీను, కోటనందూరు

ప్రాతఃస్మరామి లలితా!

- లలిత త్రిపురసుందరి దేవిగా దర్శనం
- ప్రత్యేక పూజలు చేసిన మహిళలు



సిరిపురంలో బోనాలు ఊరేగిస్తున్న మహిళలు



దేవీచౌక్ కనకదుర్గమ్మకు సారె సమర్పించిన భక్తులు



రౌతులపూడిలో లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు



గాయత్రీదేవి అలంకరణలో రత్నగిరి వనదుర్గమ్మ వారు

ఏలేశ్వరం: శరన్నవరాత్ర మహోత్సవాల్లో ఆరో రోజున కనకదుర్గమ్మ వారు శీ లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తోంది. దేవీ ఉపాసకులకు ఈ తల్లి ప్రధాన దేవత. త్రిగుణాతీతమైన కామేశ్వర స్వరూపం ఆమెది. పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో అమ్మవారిని లలిత త్రిపురసుందరిదేవిగా ఆలంకరించడంతో ప్రత్యేకత సంతరించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయాల వద్ద మహిళలు కుంకుమపూజలు నిర్వహించారు. మండలంలోని సిరిపురం గ్రామంలో మహిళలు భారీగా బోనాలతో పలు వీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు.

లలితా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు

రౌతులపూడి: దేవీ శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా స్థానిక సినిమా సెంటర్‌లో వేంచేసియున్న కనకదుర్గ అమ్మవారు శనివారం లలితా త్రిపురసుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వివిధ రకాల మట్టిగాజులతో అలంకరించిన అమ్మవారిని వేకువ జామునుంచే ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారికి పురోహితులు బానుబాబు ఆధ్వర్యంలో భక్తులు సామూహిక కుంకమార్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ (శ్రీనివాసావర్తక సంఘం) నిర్వాహకులు భక్తులు పాల్గొన్నారు.

గాయత్రీ దేవి అలంకరణలో నేరేళ్లమ్మవారు

తొండంగి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం గోపాలపట్నం నేరేళ్లమ్మ అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ప్రధానాలయంలో మూల విరాట్‌కు సప్తనదీ జాలాలతో అభిషేకం, పంచామృతాభిషేకం వివిధ పూజలు నిర్వహించారు. మండలంలోని పలు అమ్మవారి ఆలయాల్లో భజనలు, భక్తిపాటలు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.

వనదుర్గ, కనక దుర్గమ్మలకు పూజలు

తొండంగి(అన్నవరం): దసరా శరన్నవరాత్ర వేడుకల్లో భాగంగా శనివారం రత్నగిరిపై కొలువైన వనదుర్గ, కొండదిగువ కనకదుర్గ అమ్మవార్లు గాయత్రిదేవి అలంకరణలో భక్తులు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మి సత్యవతి దేవి అమ్మవారికి, వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్ల ఆలయాల్లోనూ పండితులు వేదమంత్రోఛ్చారణతో రుత్వికులు ప్రత్యేక పూజలు, అష్టోత్తరశత సహస్రనామార్చన, లక్ష కుంకుమార్చన వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

108 రకాల స్వీట్లతో నివేదన

గోకవరం: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా స్థానిక దేవీ చౌక్‌లో వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారికి శనివారం 108 రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. తొలిత స్థానిక మహిళా భక్తులు పురవీధుల్లో సారె ఊరేగించారు. ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథ్ శర్మ, శ్రీనివాస్ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించారు.

భవానీల కలశ పూజ

ప్రత్తిపాడు: శరన్నవరాత్ర మహోత్సవాలల్లో భాగంగా ప్రత్తిపాడులో శనివారం భవానీ భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో కలశ పూజలు నిర్వహించారు. స్థానిక శివాలయం వద్ద గల దుర్గాదేవి ఆలయంలో భవానీ మాలధారులు భాజా భజంత్రీలు, మేళతాళాలతో కలశాలు శిరస్సున దాల్చి పుర ప్రదర్శన నిర్వహించారు. గురు భవానీ దాసరి సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భవానీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మహాలక్ష్మీ దేవి అమ్మవారుగా దర్శనం

ప్రత్తిపాడు రూరల్: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా శనివారం దుర్గాదేవి అమ్మవారు గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాచపల్లి అరుణాచల క్షేత్రంలో అపిత కుచాంబా, ధర్మవరం సూర్యారావుపేటలో కనక దుర్గమ్మ, ఒమ్మంగి విజయదుర్గ అమ్మవార్లను అలంకరించారు. రాచపల్లిలో భవాని భక్తులు అగ్నిగుండం తొక్కారు. ధర్మవరం కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో భక్తులు కుంకుమ పూజలు చేశారు.

దుర్గాదేవికి బోనాల సమర్పణ

జగ్గంపేట: మండలంలోని మన్యవారిపాలెం గ్రామంలో దేవి నవరాత్రులు పురస్కరించుకుని గ్రామంలోని దుర్గాభవాని ఆలయ ఏడో వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి బోనాలను సమర్పించారు. శనివారం 108 కన్యలు బోనాలు ఎత్తుకుని గ్రామంలో ఊరేగింపు నిర్వహించి అమ్మవారి ఆలయానికి చేరుకుని బోనాలు సమర్పించారు. పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

కుల వివక్షపై న్యాయమూర్తి విచారణ



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి గోపీనాథ్

ప్రత్తిపాడు: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రత్తిపాడు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎల్. గోపీనాథ్ మండల స్థాయి అధికారులతో కలిసి శనివారం సాయంత్రం స్థానిక ఉపకారాగారాన్ని తనిఖీ చేశారు. కుల వివక్షపై కారాగారంలోని ఖైదీలను ఆయన విచారించారు. కుల వివక్ష చూపితే తనకు తెలియజేయాలని ఖైదీలకు సూచించారు. కారాగారం పరిసరాలను, ఖైదీలకు ఆహారం వంటి పెట్టే పాత్రలను, తాగే నీటిని ఆయన క్షుణంగా పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న వసతులను వారిని అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని వారికి ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం, ఎంఈఓ వి.రాజబాబు, సీహెచ్‌సీ సూపరిటెండెంట్ డాక్టర్ బి.సౌమ్యమైఖేల్, ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతిగృహ సంక్షేమాధికారి ఎం.సత్యనారాయణ, ప్యానెల్ అడ్వకేట్లు బుగత శివ, కూసుమంచి సూర్యప్రకాష్, నీటి పారుదలశాఖ ఏఈ, లోక్అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

- పన్ను వసూళ్లలో అవినీతిపై వాగ్వాదం
- సవాళ్లు విసురుకున్న సభ్యులు



కౌన్సిల్ సమావేశంలో వారించుకుంటున్న సభ్యులు

ఏలేశ్వరం: ఏలేశ్వరం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరిగింది. జగనన్న కాలనీలో ఇంటిపన్ను ద్యాకుమెంట్ల అవినీతిపై కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరిగింది. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ముందుగా సమావేశంలో అజెండా చదువుతుండగా అనేక అంశాలపై కౌన్సిలర్లు తమ అభ్యంతరాలను తెలిపారు. ఇటీవల జగనన్న కాలనీలో ఇంటిపన్ను వేసేందుకు ద్యాకుమెంట్ల సేకరణ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని 3వ వార్డు కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇంటి పన్ను వేసేందుకు సచివాలయ సిబ్బంది ఉండగా మధ్యవర్తుల ప్రమేయం ఎందుకని గోవిందు అధికారులను ప్రశ్నించారు. దీనిపై 4వవార్డు కౌన్సిలర్ బదిరెడ్డి గోపి మాట్లాడుతూ ఇంటిపన్ను విషయంలో ఎక్కడ అవినీతి జరగలేదని నిరూపిస్తే తమ చెప్పుతో తామే కొట్టుకుంటామన్నారు. దీనిపై చర్చించడానికి సమయం, స్థలం తెలుపుతామని గోపి అనగా తాము సిద్ధమేనని గోవిందు అన్నారు. దీంతో కాసేపు వాదోపవాదాలతో సమావేశం గందరగోళంగా మారింది. ఏలేశ్వరంలో రెండుసార్లు సర్పంచ్‌గా, ఎంపీపీ పనిచేసిన వ్యక్తికి చెందిన స్థలాన్ని కమర్షియల్ మార్చాలని ఆయన సతీమణి దరఖాస్తు చేసుకొని మూడునెలలు గడుస్తున్నా ఇప్పటివరకు స్పందన లేదన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులను సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కమిషనర్ సూర్యప్రకాశరావు, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సారా రహిత జిల్లాగా మార్చేందుకు కృషి



ప్రత్తిపాడు ఎక్సైజ్ కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న రాహుల్ దేవ్ శర్మ

ప్రత్తిపాడు: కాకినాడ జిల్లాను సారా రహితంగా కలిసికట్టుగా మార్చేందుకు ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కృషి చేయాలని డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ అన్నారు. ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో శనివారం సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. ప్రభుత్వం చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమ లక్ష్యాన్ని పూర్తిచేయాలన్నారు. నాటు సారా నష్టాలను ప్రజల్లో అవగాహన కల్పించి, సారాను పూర్తిగా తరిమివేయాలని సూచించారు. సారా రహిత గ్రామాలుగా గుర్తించినా దాడులు కొనసాగించాలన్నారు. నిందితులు సారా తయారీ, రవాణా, క్రయవిక్రయాలను వీడకపోతే పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ వై.చైతన్య మురళి, అసిస్టెంట్ కమీషనర్ వి.రేణుక, ఎక్సైజ్ సూపరిటెండెంట్ ఎం.కృష్ణకుమారి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిటెండెంట్లు వి.రామకృష్ణ, కె. జయమౌనిక, టాస్క్‌ఫోర్స్ సూపరిటెండెంట్ దేవదత్తు, స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్, తుని, పిఠాపురం, పెద్దాపురం ఎక్సైజ్ సీఐలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయ వనరులు సమకూర్చండి

శంఖవరం: పంచాయతీలకు ఆదాయ వనరులు సమకూర్చాలని పంచాయతీ కార్యదర్శులకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వై.నాగలక్ష్మీ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండవ రోజు పంచాయతీల సొంత ఆదాయ వనరుల సమీకరణపై సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో శనివారం ఆమె పాల్గొన్నారు. పంచాయతీ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలు, షాపులు, చేపల చెరువులు తదితర వాటిని లీజుకు ఇచ్చి ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చన్నారు. సంపద కేంద్రాల్లో రీసైక్లింగ్ ద్వారా కంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించే వెసులుబాటు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కీర్తన, పంచాయతీ కార్యదర్శిలు వాడ్రేవు చక్రవర్తి, అప్పలరాజు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

తొండంగి: మద్యానికి బానిసైన భర్తలో మార్పు వస్తుందని భార్య పుట్టింటికి వెళ్లగా కాపురానికి భార్య రాలేదని మనస్తాపంతో భర్త ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు తొండంగి ఎస్సై జగన్మోహన్‌రావు శనివారం రాత్రి తెలిపారు. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం ఉప్పరాపల్లి గ్రామానికి చెందిన కిల్లాడ శివకు యలమంచిలి మండలం గుండురుబిల్లి గ్రామానికి చెందిన కిల్లాడ దుర్గలకు ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఏడేళ్ల కుమార్తె శ్రావ్య, ఐదేళ్ల కుమారుడు తేజ ఉన్నారు. మృతుడు తొండంగి వైష్ణోదేవి గ్యాస్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. మద్యం సేవించి మత్తుకు బానిసవ్వడంతో భర్తలో మార్పు వస్తుందని భార్య దుర్గ పిల్లల్ని ఇద్దరిని తీసుకుని పుట్టింటి వెళ్లింది. భార్య కాపురానికి రాలేదన్న మనస్తాపంతో ఒంటిమామిడిలో తన ఆడపడుచు ఇంటికి వెళ్లిన శివ (34) ఫ్యానుకు ఉరివేసుకుని శనివారం ఉదయం విగత జీవిగా కనిపించడంతో బంధువులు భార్యకు సమాచారం ఇచ్చారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

తీరంలో అలజడి



యర్రయ్యపేటలో లంగరు వేసిన బోటును తీరానికి తరలిస్తున్న మత్స్యకారులు

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలంలోని సముద్రతీరాల్లో అలల ఉధృతి ఎక్కువగా ఉంది. అద్దరిపేట, పెరుమాళ్లపురం, దానవాయిపేట, కొత్తపేట, యర్రయ్యపేట, పంపాదిపేట, తాటియాకులపాలెం, కొత్తచోడిపల్లిపేట తదితర సముద్రతీరాల్లో రెండు మీటర్లు వరకూ అలలు ఎగసిపడుతున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా ఉన్న నేపథ్యంలో తీరంలో లంగరు వేసిన బోట్లును మత్స్యకారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రతికూల పరిస్థితుల్లో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్.ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. తీరప్రాంత గ్రామాల్లో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామన్నారు.

మహిళల ఆరోగ్యమే ప్రధాన కర్తవ్యం



ఏలేశ్వరంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, వైద్య సిబ్బంది

ఏలేశ్వరం: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యకరంగా ఉండాలనే లక్ష్యంతో పట్టణంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు స్క్రీనింగ్, రక్తపోటు, మధుమేహం, రొమ్ము, నోటి, గర్భశయ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ మహిళలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో మున్సిపల్ కౌన్సిలర్లు బదిరెడ్డి గోవిందు, బదిరెడ్డి వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు సామంతుల సూర్యకుమార్, శిడగం వెంకటేశ్వరరావు, సుంకర రాంబాబు, అంగన్‌వాడీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

200 మందికి కంటి పరీక్షలు

కిర్లంపూడి: కాకినాడకు చెందిన వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో వేలంక గ్రామంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక నాయకుడు గండే చినకాశీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 200 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు 36 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

కారు ఢీకొని ఫొటోగ్రాఫర్ మృతి

పరారీలో ఉన్న కారును గుర్తించిన పోలీసులు



మృతుడు రంగబాబు

గండేపల్లి: కారు ఢీకొన్న ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ మృతి చెందినట్టు గండేపల్లి పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు మండలంలోని గండేపల్లికి చెందిన భాస్కరిణి నాగ వీర వెంకట రంగబాబు (40) ఫొటోగ్రఫీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. దీనిలో భాగంగానే శనివారం మోటార్ సైకిల్‌పై రాజమహేంద్రవరం వెళ్తున్నాడు. మురారిలో హైవేపై మీ-సేవా సమీపంలోకి వచ్చేసరికి విజయనగరం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొంది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగ్రాతుడిని స్థానికుల సహాయంతో చికిత్స నిమిత్తం ప్రైవేటు వాహనంలో రాజానగరం జీఎస్‌ఎల్ ఆస్పత్రికి తరలించగా పరీక్షలు చేసిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేయనున్నట్టు పేర్కొన్నారు. ప్రమాదానికి కారణమైన కారు తప్పించుకుపోవడంతో నెంబర్ ప్లేట్ ఆధారంగా కారును గుర్తించామన్నారు. మృతుడికి భార్య నాగ సీత మహాలక్ష్మి, 6వ తరగతి చదువుతున్న కూతురు మంగతాయారు, 8వ తరగతి చదువుతున్న కొడుకు సుబ్రహ్మణ్యం ఉన్నారు. భార్యకు మూగ, వినికిడి లోపం ఉందని, భర్త మృతితో కుటుంబం ఆదరణను కోల్పోయిందని, ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరుతున్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పణ



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న ఉద్యోగులు

జగ్గంపేట: గ్రామ వార్డు, సచివాలయాల ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతు జగ్గంపేటలో జేఏసీ పిలుపు మేరకు రాజ్యాంగ నిర్మాత దాదా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి ఉద్యోగులు వినతిపత్రాన్ని శనివారం సమర్పించారు. జిల్లా గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి బి.జాన్ క్రిస్టోఫర్ మాట్లాడుతూ ఉద్యోగులు క్షేత్ర స్థాయిలో తీవ్ర అవమానాలకు గురికావడంతో ఆత్మగౌరవానికి భంగం వాటిల్లుతోందన్నారు. దీనిపై ప్రభుత్వం తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.ప్రసాద్, ట్రెజరర్ సీహెచ్ రాజేష్, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.నాగమణి, జగ్గంపేట, గండేపల్లి మండలాల నాయకులు పాల్గొన్నారు.